

ప్రశాంతంగా కోర్టు ఉద్యోగాల పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు


రాష్ట్రవ్యాప్తంగా కోర్టుల్లో ఉద్యోగాల భర్తీ కోసం ఆన్‌లైన్ విధానం ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నారని, అందులో భాగంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా కూడా ఈ నెల 21వ తేదీ నుండి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగాల ప్రతిభ ఆధారంగా భర్తీ చేస్తున్నామని, కొంతమంది దళారులు వేరే మార్గాల ద్వారా ఉద్యోగాలు ఇప్పిస్తామని అభ్యర్థులను మభ్యపెడుతున్నట్లుగా వదంతులు వస్తున్నాయని పేర్కొన్నారు. అటువంటి వదంతులను ఎంత మాత్రం నమ్మవద్దని, ఈ ఉద్యోగాలు ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ ఆధారిత పరీక్షలుగా నిర్వహిస్తున్నామని, ఎటువంటి ఇంటర్వ్యూలూ లేవని తెలిపారు. స్టెనోగ్రాఫ్, టైపిస్టు ఉద్యోగాలకు టెక్నికల్ స్కిల్ టెస్ట్ ఉంటాయని పేర్కొన్నారు.

అధికారులే అడ్డగోలుగా..!

- నిబంధనలకు విరుద్ధంగా పేదల భూముల్లో ఇళ్ల స్థలాల కేటాయింపు
- నిరుపేదలకిచ్చిన రెండెకరాల భూమి దౌర్జన్యంగా స్వాధీనం
- చిల్లిగవ్వ పరిహారం ఇవ్వకుండా అధికారుల ఇష్టారాజ్యం
- పట్టా, పాస్‌పుస్తకం ఉన్నా సమాధానం చెప్పే నాథుడే కరువు
- ముసునూరు మండలం రంగంపేటలో అధికారుల తీరుపై విమర్శలు
- న్యాయం చేయాలంటూ అధికారుల చుట్టూ బాధితుల ప్రదక్షిణలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నిబంధనలకు అనుగుణంగా పనిచేయాల్సిన అధికారులే 'కంచె చేను మేసిన' చందంగా అడ్డగోలుగా వ్యవహరిస్తే జనం ఎవరికి చెప్పుకోవాలి. నిరుపేద కుటుంబాలకు ఉన్న కాస్త భూమిని అడ్డగోలుగా వారి అనుమతి లేకుండా లాగేసుకుంటే వారు ఎవరికి మొరపెట్టుకోవాలి. ముసునూరు మండలం రంగంపేట గ్రామంలో దళిత కుటుంబాలకు చెందిన రెండెకరాల అసైన్డ్ భూమిని చిల్లిగవ్వ పరిహారం ఇవ్వకుండా అధికారులు దౌర్జన్యంగా లాగేసుకుని ఇళ్ల స్థలాలకు కేటాయించడంపై బాధితులు లబోదిబోమంటున్నారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.



జలంధరరావు పేరిట పాస్‌బుక్

రంగంపేట గ్రామంలో బేతమాల జలంధరరావు, కాలి బాబ్జి, చేబోత్తున యాకోబు, పార్వతి అనే నలుగురికి 1991లో ప్రభుత్వం అరెకరం చొప్పున మొత్తం రెండెకరాల అసైన్డ్ భూమిని ఇచ్చింది. పట్టా, పాస్‌బుక్ సైతం ప్రభుత్వం వారికి అందించింది. మినుము వంటి పంటలను పండిస్తూ సాగు చేసుకుంటున్నారు. ఈ రెండెకరాల భూమి బలివెల రెవెన్యూ పరిధిలో రోడ్డుపక్కగా ఉంది. గోపవరం, వేపుచర్లకు మధ్య ఈ భూమి ఉన్నట్లు చెబుతున్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలనే లక్ష్యంతో ప్రభుత్వం పలుచోట్ల ప్రభుత్వ భూమిని సేకరించింది. ప్రభుత్వ భూమి అందుబాటులో లేని గ్రామాల్లో పెద్దఎత్తున సొమ్ము చెల్లించి భూమిని కొనుగోలు చేసి ఇళ్లస్థలాల పంపిణీ చేపట్టింది. రైతుల నుంచి భూమి కొనుగోలు చేసేటప్పుడు పరిహారం వంటివి ఇచ్చారు. అయితే నాలుగు దళిత కుటుంబాలకు చెందిన రెండెకరాల భూమిని ఇళ్ల స్థలాలకు కేటాయించిన అధికారులు వారికి చిల్లిగవ్వ పరిహారం ఇవ్వలేదు. కనీసం వారి అనుమతి కూడా తీసుకోకుండా భూమిని తీసేసుకున్నారు. అదేమని అడిగితే సమాధానం చెప్పని పరిస్థితి నెలకొంది. తమకున్న కొద్దిపాటి భూమి కోల్పోయి ఆ కుటుంబాలు రోడ్డున పడిన పరిస్థితి ఉంది. తమ భూములు తమకు ఇచ్చేయాలని, లేనిచో పరిహారం ఇవ్వాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు. మండలంలోని రెవెన్యూ అధికారులు స్పందించకపోవడంతో తమకు న్యాయం చేయాలని ఏలూరు కలెక్టరేట్ వద్ద బాధిత కుటుంబాలు ఆందోళన చేపట్టాయి. నిరుపేదలేగా ఎవరు అడుగుతారనే ధీమాతోనే బలవంతంగా భూములు లాగేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ భూములకు సంబంధించి పట్టా, పాస్‌బుక్‌తోపాటు ప్రభుత్వం అందిస్తున్న రైతుభరోసా సొమ్ము సైతం మొన్నటి వరకూ రైతులు అందుకున్నారు. ఇన్ని ఆధారాలు పక్కాగా ఉన్నప్పటికీ పరిహారం ఇవ్వకుండా భూములు ఏవిధంగా తీసుకున్నారో ఏఒక్కరికీ అర్థంకావడం లేదు. దీని వెనుక పెద్దఎత్తున గూడుపుఠాణి జరిగినట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా భూములు కోల్పోయిన పేదలకు న్యాయం చేయాల్సి ఉంది. అధికారులే అడ్డగోలుగా వ్యవహరించడంపై తీవ్రమైన విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ భూములకు సంబంధించిన వ్యవహారంపై ముసునూరు తహశీల్దార్ డి.సుధను వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

43 సెంట్లు భూమి తీసుకుని సమాధానం చెప్పడం లేదు



వన్నికూటి దేవమాత, బాధిత కుటుంబ సభ్యురాలు, రంగంపేట

మా నాన్న బేతమాల జలంధరరావుకు ప్రభుత్వం 1991లో 42 సెంట్లు భూమి ఇచ్చింది. పట్టా, పాస్‌బుక్ సైతం ఉన్నాయి. ప్రభుత్వం రైతుభరోసా కూడా ఇస్తోంది. ఇళ్ల స్థలాల కోసం తమ అనుమతి లేకుండా భూమి తీసేసుకున్నారు. చిల్లిగవ్వ పరిహారం ఇవ్వలేదు. అడిగితే సరైన సమాధానం కూడా చెప్పడం లేదు. ఈ భూములే మా కుటుంబానికి ఆధారం. జిల్లా ఉన్నతాధికారులు న్యాయం చేయాలని కోరుతున్నాం.

అరెకరం భూమి తీసేసుకున్నారు



బేబత్తిన పిచ్చియ్య, రంగంపేట

మా నాన్న చేబత్తిన యాకోబుకు 50 సెంట్లు భూమి ప్రభుత్వం ఇచ్చింది. ఎప్పటి నుంచో మా కుటుంబమే సాగు చేసుకుంటుంది. ఇళ్లస్థలాల కోసం మా అనుమతి లేకుండా తీసేసుకున్నారు. చిల్లిగవ్వ కూడా పరిహారంగా ఇవ్వలేదు. అధికారుల వద్దకు వెళ్లినా సమాధానం చెప్పడం లేదు. మాకు న్యాయం చేయాలని కోరుతున్నాం.

భూమికి భూమితోపాటు పరిహారం ఇవ్వాలి



పి.రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి

పేదలు సాగు చేసుకుంటున్న భూములను వారి అనుమతి లేకుండా ఇళ్లస్థలాలకు కేటాయించి, ఆపై మాకు ఏమీ సంబంధం లేదన్నట్లు అధికారులు వ్యవహరించడం దారుణం. వెంటనే భూమిని తిరిగి బాధితులకు ఇవ్వాలి. లేకపోతే భూమికి భూమితోపాటు నష్టపరిహారం అందించాలి. లేకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తాం.



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ పి.అరుణ్‌బాబు

అర్హులైన ప్రతిఒక్కరికీ పెన్షన్

మంజూరుకు అర్హతే ప్రామాణికం - జనవరిలో మరో 9 వేల మందికి కొత్త పెన్షన్లు

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో అర్హులందరికీ పెన్షన్ కానుక అందిస్తామని, అర్హతున్న ఏఒక్కరికీ పెన్షన్ తొలగించబోరని ఇన్‌ఛార్జి జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు స్పష్టం చేశారు. శనివారం ఉదయం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీకి కార్యాచరణ, నూతన రేషన్ కార్డులు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు తదితరులతో అమరావతి నుంచి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనిలో స్థానిక జిల్లా కలెక్టరేట్ నుంచి ఇన్‌ఛార్జి కలెక్టర్ పి.అరుణ్‌బాబు, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, మెప్మా పీడీ ఇమ్మానుయేల్, డిఎస్‌ఒ ఆర్‌ఎస్‌ఎస్.సత్యనారాయణరాజు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఇన్‌ఛార్జి కలెక్టర్ పి.అరుణ్‌బాబు మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 17 రకాల లబ్ధిదారులైన 2,65,813 మందికి ప్రతినెలా రూ.68.02 కోట్లు పెన్షన్‌గా అందిస్తున్నారన్నారు. గతేడాది జనవరిలో 11,470 మందికి, ఆగస్టులో 13,748 మందికి కొత్త పెన్షన్లు మంజూరు చేశారన్నారు. వచ్చే జనవరిలో అర్హులైన మరో తొమ్మిది వేల మందికి కొత్త పెన్షన్లు అందించడం జరుగుతుందన్నారు. అర్హతున్న ఏఒక్క పెన్షన్ కూడా తొలగించబోరని, అదేవిధంగా నోటీసులిచ్చిన వారికి సంబంధించి క్షేత్రస్థాయిలో పూర్తి పారదర్శకతతో సమగ్ర విచారణ జరుగుతుందన్నారు. నోటీసు పొందిన వారికీ జనవరిలో పెన్షన్ యథావిధిగా పంపిణీ చేస్తారన్నారు. వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక అర్హత పరిశీలనలో భాగంగా జిల్లాలో పెన్షన్ పొందుతున్న 2,65,813 మందిలో వివిధ కారణాలతో 6,500 మందికి నోటీసులు ఇచ్చామన్నారు. ఈ విషయంపై లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తామన్నారు. నోటీసు అందుకున్న వారి దగ్గరకు శనివారం నుంచి గ్రామీణ ప్రాంతంలో సంబంధిత పంచాయితీ కార్యదర్శి, పట్టణ ప్రాంతాల్లో వెల్ఫేర్ అసిస్టెంట్లు స్వయంగా వెళ్లి విచారిస్తారన్నారు. ఈ సందర్భంగా నోటీసులో పొందుపరిచిన వివరాలను వారికి చదివి వినిపిస్తారని, వారి దగ్గర ఏవైనా ఆధారాలుంటే సేకరిస్తారని తెలిపారు. ఏలూరు నగరంలో 62 సచివాలయాల పరిధిలో 1561 పెన్షనర్లకు సంబంధించి సంబంధిత వెల్ఫేర్ అసిస్టెంట్లు వ్యక్తిగతంగా వెళ్లి నాలుగు రోజుల్లో పరిశీలన పూర్తి చేయాలన్నారు. డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు మాట్లాడుతూ పెన్షన్ నిలుపుదల వదంతులను నమ్మవద్దన్నారు. పరిశీలన కోసం నోటీసులు ఇచ్చామన్నారు.



ఏలూరులో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిఐటియు నేతలు

సిఐటియు రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలి

పలుచోట్ల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఏలూరు

భీమవరంలో జనవరి 2, 3, 4 తేదీల్లో జరగనున్న సిఐటియు రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వి.సాయిబాబు పిలుపునిచ్చారు. మహాసభ పోస్టర్లను స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడగా సిఐటియు నగర అధ్యక్షులు బి.జగన్నాథరావు, ఆటో యూనియన్ నాయకులు జి,గోపీ, మెడికల్ అండ్ రిప్రజంటేటివ్ యూనియన్ నాయకులు సీతయ్య, జి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉంగుటూరు: 'ఐక్యత-పోరాటాలే' ఆయుధంగా నిత్యం కార్మిక, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు పని చేస్తుందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కొక్కిరిపాటి వెంకట్రావు తెలిపారు. శనివారం చేబ్రోలులో శ్రీవరసిద్ధి వినాయక ఆటో ఓనర్స్, డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట్రావు, యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు మదర్, ఆకుల రాజ్‌శేఖర్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం జారీ చేసిన జిఒ నెం.21ను రద్దు చేయాలని, ఇ-చలానాల పేరుతో ట్రాఫిక్ పోలీసుల వేధింపులు మానుకోవాలని కోరారు. రవాణారంగ కార్మికుల భద్రతకు చర్యలు చేపట్టి ప్రమాదాలకు గురౌతున్న వారికి నష్టపరిహారం చెల్లించాలని, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు సీరా అప్పారావు, నేతలు దాసరి రాము, తంతపురెడ్డి రాజు, మహ్మద్ అహ్మద్, పి.శాంతిరాజు, కె.జాన్‌బాబు, ఎ.శామ్యూల్, ఎం.చంద్రశేఖర్, కె.సత్యనారాయణ, పి.వంశీ, ఎం.నాగరాజు, కృపావరం పాల్గొన్నారు.

దెందులూరు: జనవరి 2, 3, 4 తేదీల్లో భీమవరంలో జరిగే సిఐటియు 16వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం దెందులూరు మండలం అధ్యక్షులు మాత్రపు రమేష్, కొవ్వలి ఆటో స్టాండ్ డ్రైవర్ల అధ్యక్షులు ఎర్ర రాములు కోరారు. వారు రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు.



సంతకాల సేకరణలో ఎంఎల్‌సి సాబ్జీ

సిపిఎస్ రద్దు కోరుతూ సంతకాల సేకరణ

ప్రజాశక్తి - చింతలపూడి

సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ కోరారు. సిపిఎస్ రద్దు కోరుతూ పట్టణంలో యుటిఎఫ్ ఆధ్వర్యాన చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమంలో శుక్రవారం సాయంత్రం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాబ్జీ మాట్లాడుతూ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 2007లో కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల సేవలను క్రమబద్ధీకరించారన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సైతం ఆ విధానాన్ని అమలు చేయాలని కోరారు. గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న ఉపాధ్యాయుల జీతాలు పెంచాలని కోరారు. ఎన్‌ఇపి-2020 ద్వారా విద్యా రంగానికి తీరని నష్టం జరుగుతుందన్నారు. 3, 4, 5 తరగతులను హైస్కూల్లో కలపడం ద్వారా విద్యార్థులుగా ఎందరో డ్రాప్‌వుట్‌లుగా మారారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఎన్‌రోల్‌మెంట్ రెండు లక్షలకుపైగా తగ్గిందని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని సూచించారు. పిఎఫ్, ఎపిజిఎల్‌ఐ, సరెండర్ లీవులు, మెడికల్ బిల్లులు, పిఆర్‌సి బకాయిలు సకాలంలో చెల్లించకుండా ఉద్యోగ, ఉపాధ్యాయులను మానసిక వేదనకు గురి చేస్తున్నారన్నారు. బకాయిలను వెంటనే విడుదల చేయలని కోరారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు యుటిఎఫ్ నేతలు పాల్గొన్నారు.

నగర ప్రజలకు పరిశుభ్రమైన నీటిని అందించాలి

ఇన్‌ఛార్జి కమిషనర్ జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్ల ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని కార్పొరేషన్ ఇన్‌ఛార్జి కమిషనర్, జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. దెందులూరు హైవే ప్రాంతంలోని ప్రధాన తాగునీటి చెరువు ప్రాంతాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అరుణ్‌బాబు మాట్లాడుతూ నగరంతోపాటు విలీనమైన ఏడు గ్రామ పంచాయతీలకు గోదావరి జలాలను తరలించి నీటి సరఫరాకు తగు చర్యలు చేపట్టాలన్నారు. నగర పరిధిలోని వన్‌టౌన్ ప్రాంతంలో పది రిజర్వాయర్ల ద్వారా, రెండో పట్టణ పరిధిలో 16 రిజర్వాయర్ల ద్వారా నగర ప్రజలకు నీటి సరఫరా జరుగుతుందన్నారు. ప్రజలకు అందించే నీటి సరఫరా విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా ప్రణాళికాబద్ధంగా పని చేయాలన్నారు. ముందస్తుగానే సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను శుద్ధి చేసి నీటి నిల్వలను పెంచుకోవాలని కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా నగర ప్రజలకు అందించే గోదావరి జలాల నీటి సరఫరాపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రానున్న వేసవిలో నీటిఎద్దడి తలెత్తకుండా ముందస్తుగానే ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం 15వ ఆర్థిక సంఘం నిధులతో ఏర్పాటు చేసిన 150 హార్స్‌పవర్ గల మూడు కొత్త మోటర్ల పని తీరును అరుణ్‌బాబు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఎస్ఇ వెంకటేశ్వరరావు, డిఇ సత్యనారాయణ, ఎఇ శేషగిరిరావు, నీటి సరఫరా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.



పంపుల చెరువును పరిశీలిస్తున్న జెసి అరుణ్‌బాబు

రేపు యథావిధిగా స్పందన

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో ఈ నెల 26వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి 'స్పందన' కార్యక్రమం యథావిధిగా నిర్వహిస్తామని ఇన్‌ఛార్జి కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని డివిజనల్, మండల, మున్సిపల్ కార్యాలయాల్లోను 'స్పందన' కార్యక్రమం యథావిధిగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఫిర్యాదుదారులు తప్పనిసరిగా మాస్కు ధరించి భౌతికదూరం పాటించాలని కోరారు.

కదిలిన ధాన్యం లోడు ట్రాక్టర్లు

ప్రజాశక్తి కథనానికి స్పందన


ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల కేంద్రమైన ముదినేపల్లి తదితర గ్రామాల్లో వివిధ రైస్‌మిల్లుల వద్ద ధాన్యపులోడుతో మూడు రోజులుగా నిలిచి ఉన్న ట్రాక్టర్లు ఎట్టకేలకు శనివారం సాయంత్రం కదిలాయి. రైతుల అవస్థలు గురించి 'ధాన్యం కొనే నాథుడే లేడు' శీర్షికన ప్రజాశక్తిలో శనివారం కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై జిల్లాస్థాయి ఉన్నతాధికారులు స్పందించారు. ట్రాక్టర్ల నుంచి ధాన్యం ఎందుకు దిగుమతి చేసుకోవడం లేదు, ధాన్యం దిగుమతి కాక రైతుల ఇబ్బందుల గురించి మండలస్థాయి అధికారులను ఆరా తీశారు. జిల్లా ఉన్నతాధికారుల జోక్యంతో ఎట్టకేలకు శనివారం సాయంత్రం మూడు గంటల తర్వాత ఆర్‌బికె అధికారులు రైతులకు సంబంధిత పత్రాలు ఇవ్వడంతో నిలిచి ఉన్న ట్రాక్టర్లు కదిలాయి. మండలంలోని చిగురుకోట, అల్లూరు, పెదకామనపూడి, కొత్తపల్లితోపాటు వివిధ గ్రామాల్లోని రైసుమిల్లులకు పంపి ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టారు. మండలస్థాయి అధికారులు సూచించిన రైసుమిల్లులకు రైతులు తమ ధాన్యాన్ని తరలించారు. దీంతో మూడు రోజులుగా ధాన్యపులోడు దిగుమతి కాక ఇబ్బందులు పడుతున్న రైతులు, ట్రాక్టర్ డ్రైవర్లు హమ్మయ్యా అంటూ ఊపిరి పీల్చుకున్నారు.

ఇదేం పర్యవేక్షణ..!

పరిశ్రమల్లో ఆగని ప్రమాదాలు

గంజాయి అమ్మకాలకు అడ్డుకట్ట పడేనా?



ప్రభుత్వ విధానాల ఫలితంగా జిల్లాలో వివిధ శాఖల పర్యవేక్షణ, నిఘా విభాగాలు నిద్రావస్థలోకి వెళ్లడంతో చోటుచేసుకుంటున్న వరుస ఘటనలు జనాలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల ఫలితంగా పరిశ్రమల్లో భద్రతా చర్యలు కొరవడి తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటూ కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇక గంజాయి ఎక్కడికక్కడే పట్టుబడుతుండడం వాటి అమ్మకాలు ఆ స్థాయిలో విస్తృతమయ్యే వరకూ పోలీసు నిఘా విభాగం ఏం చేస్తుందనే ప్రశ్నలూ ఉత్పన్నమవుతున్నాయి.

ఫుడ్‌ఫ్యాట్స్ అండ్ ఫెర్టిలైజర్స్‌లో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంతో జిల్లాలోని పరిశ్రమల్లో నెలకొన్న భద్రతా ప్రమాణాలపై చర్చ తెరపైకి వచ్చింది. ఈ ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోగా మరో ఇద్దరు ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. మరో ముగ్గురు గాయాలతో ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్నారు. గతంలో ముసునూరు మండలం అక్కిరెడ్డిగూడెంలో పోరస్ కంపెనీలో చోటుచేసుకున్న పేలుడు ఘటనలో 12 మంది కార్మికులు దుర్మరణం పాలైన ఘటన అందరికీ తెలిసిందే. దానికి ముందు మొగల్తూరు మండలంలో ఆనంద ఆక్వా పరిశ్రమలో చోటుచేసుకున్న ప్రమాదంలో ఐదుగురు వరకూ మృత్యువాత పడ్డారు. జిల్లాలో పలుచోట్ల పరిశ్రమల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. ప్రాణనష్టం సంభవించినప్పుడు అధికారులు హడావుడీ చేయడం మినహా ప్రమాదాల నివారణకు శాశ్వత చర్యలు చేపడుతున్న దాఖలాల్లేవు. ఫలితంగా యాజమాన్యాలు సైతం భద్రతా ప్రమాణాలను గాలికొదిలేసి కార్మికుల ప్రాణాలను గాలిలో దీపంలా వేలాడదీస్తున్నాయి. ఫుడ్‌ఫ్యాట్స్ అండ్ ఫెర్టిలైజర్స్ పరిశ్రమ ఘటనకు సంబంధించి మృతి చెందిన కార్మికుని కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం ఇస్తామని సిఐటియు జోక్యంతో యాజమాన్యం ప్రకటించింది. ఈ చర్చల్లో అధికారులు సైతం పాల్గొన్నారు. డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ, మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ ప్రశాంతి, ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ, ఇతర అధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ఎవరూ కూడా భద్రతా చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వహిస్తే కఠిన చర్యలు తప్పవని కనీసం హెచ్చరిక కూడా చేయలేదంటే ప్రభుత్వ విధానాలు యాజమాన్యాలకు ఏస్థాయిలో అనుకూలంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కార్మిక శాఖ తనిఖీలు పూర్తిగా కొరవడటమే ప్రమాదాలకు కారణమనేది బహిరంగ రహస్యం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికచట్టాల స్థానంలో లేబర్ కోడ్‌లు తీసుకురావడం మానుకుని, ఉన్న చట్టాలను పకడ్బందీగా అమలు చేస్తే చాలా వరకూ ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంది. ఆ దిశగా పాలకులు ఆలోచన చేయాలని కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

గంజాయి విక్రయాలు రెండు జిల్లాల్లోనూ జోరుగా సాగుతున్నాయి. గతంలో ఏలూరు, భీమవరం ప్రాంతాల్లో డ్రగ్స్ వినియోగం సాగుతున్నట్లు పోలీసుల దాడుల్లో బయటపడగానే జిల్లావాసులంతా ఉలిక్కిపడ్డారు. ఆ కేసుల దర్యాప్తు ఏమైందో అధికారులకే తెలియాలి. ఇటీవల జంగారెడ్డిగూడెం, భీమవరం తదితర ప్రాంతాల్లో గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుంటున్నారు. అంటే జిల్లాలోకి ఇతర ప్రాంతాల నుంచి గంజాయి యథేచ్ఛగా రవాణా అవుతుందనేది స్పష్టమవుతోంది. అలాగే పట్టణ ప్రాంతాల్లో ప్రధానంగా కళాశాల విద్యార్థులే లక్ష్యంగా ఈ గంజాయి అమ్మకాలు సాగుతున్నట్లు గతంలో ప్రచారం ఉండేది. ప్రస్తుతం ఇది మండల కేంద్రాలకూ వ్యాపించినట్లు తెలుస్తోంది. మోటారు సైకిళ్లపై వచ్చి గొలుసు దొంగతనాలకు పాల్పడేవారు, గ్రామీణ ప్రాంతాల్లో విచ్చలవిడిగా తిరుగుతూ దందాలకు పాల్పడే యువతను పోలీసులు అదుపులోకి తీసుకున్నాక వారు గంజాయి సేవిస్తున్నట్లు తేలుతుండటం పోలీసు అధికారులను సైతం విస్మయపరుస్తోంది. మరి ఇంత విచ్చలవిడిగా జిల్లాలోకి గంజాయి ప్రవేశిస్తున్నా, అమ్మకాలు సాగుతున్నా నిఘా యంత్రాంగం ఏం చేస్తుందో ఉన్నతాధికారులకే తెలియాలి. నిఘా అధికారుల పర్యవేక్షణా లోపాన్ని సరి చేసి గంజాయిని అడ్డుకోకపోతే జిల్లాలో యువత మత్తులో జోగే ప్రమాదం ఉంది.

పరిహారం కోరే హక్కు వినియోగదారులకు ఉంది

జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ పి.అరుణ్‌బాబు

ప్రజాశక్తి - ఏలూరు

నాణ్యతలేని ఉత్పత్తి, సేవల వల్ల నష్టం కలిగితే పరిహారాన్ని కోరే హక్కు వినియోగదారులకు ఉందని ఇన్‌ఛార్జి కలెక్టర్ పి.అరుణ్ బాబు అన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ వినియోగదారుల దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరుణ్‌బాబు మాట్లాడుతూ ఏదేనీ సేవ లేదా ఉత్పత్తి వల్ల వినియోగదారుడు నష్టపోతే చట్టపరిధిలో న్యాయం కోరవచ్చన్నారు. అయితే అందుకు తగిన ఆధారాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. కొనుగోలు చేసే ఉత్పత్తి పేరు, క్వాలిటీ, ఉత్పత్తి చెల్లుబాటు తేదీ వంటి విషయాలను తెలుసుకోవాల్సిన కనీస బాధ్యత వినియోగదారుడిపై ఉందన్నారు. వినియోగదారుల హక్కులు, బాధ్యతల గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. వినియోగదారులు తాము కొనుగోలు చేసిన వస్తువుపై పూర్తి అవగాహన కలిగినప్పుడు నిర్ధేశించిన ప్రమాణాల్లో ఏవైనా లోపాలు ఉంటే వారికి ప్రశ్నించే హక్కు వినియోదారుల చట్టం ద్వారా ఏర్పడిందన్నారు. ఈ విషయాలను భావి పౌరులందరికీ తెలియజేయాల్సిన బాధ్యత వినియోగదారుల సంఘాలపై ఉందన్నారు. జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్‌ఎస్‌ఎస్.రాజు మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 18 నుంచి 24 వరకు నిర్వహించిన జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా అన్ని మండల కేంద్రాల్లో కళాశాలలు, హైస్కూళ్లలో విద్యార్థులకు వినియోగదారుల సంఘ నాయకులు, డిప్యూటీ తహశీల్దార్‌లు వివిధ పోటీలు నిర్వహించారన్నారు. అక్కడ గెలుపొందిన వారికి జిల్లా స్థాయిలో వినియోగదారుల కమిషన్‌ల్లో కేసులను సమర్ధవంతంగా పరిష్కరించడం అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించామన్నారు. వినియోగదారుల సంఘం నాయకులు కట్టా సత్యనారాయణ, కుకునూరి రామచంద్రరావు, కూన కృష్ణారావు, బొమ్మిడి అప్పారావు, వి.విజయకృష్ణ, పివి.బంగార్రాజు, షేక్ మోహిద్దీన్ పాషా జాతీయ వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా విభజన అనంతరం ఏర్పాటైన ఏలూరు జిల్లా వినియోగదారుల సంఘం సమాఖ్యను ఇన్‌ఛార్జి కలెక్టర్ పి.అరుణ్‌బాబు లాంఛనంగా ప్రారంభించారు. వినియోగదారుల రక్షణకోసం విశిష్ట సేవలందిస్తున్న వినియోగదారుల సంఘం నాయకులు కట్టా సత్యనారాయణ , కుకునూరి రామచంద్రరావు, కూన కృష్ణారావు, బొమ్మిడి అప్పారావు, వి.విజయకృష్ణ, పివి.బంగార్రాజు, షేక్ మొహిద్దీన్ పాషాలను ఆయన సత్కరించారు. అనంతరం జిల్లాస్థాయి పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సహాయ పౌర సరఫరాల అధికారి లక్ష్మణబాబు, పలు వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టిసి కుటుంబాలకు కారుణ్య నియామకాలు

ప్రజాశక్తి - ఏలూరు

ఆర్టిసిలో పనిచేస్తూ మృతి చెందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కారుణ్య నియామకాల్లో భాగంగా ఇప్పటి వరకు 24 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందించినట్లు ఇన్‌ఛార్జి జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు చెప్పారు. స్థానిక కలెక్టరేట్లో 13 మంది ఆర్టిసి ఉద్యోగుల పిల్లలకు కారుణ్య నియామక పత్రాలను శనివారం ఆయన అందించారు. వీరిలో 11 మందిని గ్రామ, వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రెటరీలుగా, మరో ఇద్దరిని సాంఘిక సంక్షేమ శాఖ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశామన్నారు. గతంలో 11 మందిని గ్రామ, వార్డు సెక్రటరీ ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు.

యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని లయన్స్ క్లబ్ వద్ద యుటిఎఫ్ నూతన కౌన్సిల్ మండల అధ్యక్షులు బి.శేఖర్ అధ్యక్షతన శుక్రవారం రాత్రి నిర్వహించిన సమావేశంలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఉభయ గోదావరి జిల్లాల ఉద్యోగ ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ హాజరయ్యారు. ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి ఎంవి.అప్పారావు, పరిశీలకులు గా శ్రీనివాసరావు వ్యవహరించారు. మండల అధ్యక్షులుగా దామోదరరావు, ప్రధాన కార్యదర్శిగా బుచ్చిబాబు, గౌరవ అధ్యక్షులుగా హెమ్లనాయక్, సహ అధ్యక్షులుగా చెంచెంరాజు, వాణి, కోశాధికారిగా ప్రేమ్‌కుమార్, తొమ్మిది మంది కార్యదర్శులను, ఎనిమిది మంది జిల్లా కౌన్సిలర్లను, ఇద్దరు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు

ప్రజాశక్తి - చింతలపూడి

ఎటువంటి నేరాలు జరిగినా 14500కు ఫోన్ చేసి తెలియజేయాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సూపరిటెండెంట్ అరుణకుమారి కోరారు. చింతలపూడి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలోని సీతానగరం గ్రామంలో మత్తు పదార్థాలు, నాటుసారా వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేర ప్రవృత్తి మారకుండా తరచూ నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్ అమలు చేస్తామని తెలిపారు.

ఎన్‌ఆర్‌ఐ విద్యార్థుల దాతృత్వం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎన్‌ఆర్‌ఐ పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో స్థానిక పత్తేబాదలో ఉన్న పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలోని నిరాశ్రయులకు శనివారం పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల సిఇఒ తులసీరామ్ మాట్లాడుతూ ఇటువంటి సేవా కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో దానగుణం పెరుగుతుందని, తోటివారికి ఉపయోగపడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రిన్సిపల్ సంజీవరావు పాల్గొన్నారు.

27, 28 తేదీల్లో వ్యకాస జిల్లా సమావేశాలు

ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల 27, 28 తేదీల్లో టి.నరసాపురంలో జరుగుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా స్థాయి సమావేశాలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక సంఘం కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం టి.సత్యనారాయణ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించనున్న సమావేశాలకు ముఖ్య అతిథులుగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి పాల్గొంటున్నారని తెలిపారు.

నిజాయతీ చాటిన వ్యక్తి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

రోడ్డుపై దొరికిన పర్సును పోలీసుల ద్వారా పోగొట్టుకున్న వ్యక్తికి అప్పగించి తన నిజాయితీని చాటుకున్నారు ఓ వ్యక్తి. వివరాల ప్రకారం... బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రంలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్న జాలపర్తి మణికంఠకు శనివారం రోడ్డుపై డబ్బులు, వివిధ రకాల కార్డులు కలిగి ఉన్న పర్సు దొరికింది. మణికంఠ వెంటనే పోలీసుల వద్దకు వెళ్లి పర్సులో ఉన్న ఆధారాల ప్రకారం బుట్టాయగూడెంలోని రిటైర్డ్ పోస్ట్‌మాన్ పి.భగవాన్ పర్సుగా గుర్తించి ఆ వ్యక్తి కి అప్పగించి తన నిజాయితీని నిరూపించుకున్నారు.

పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ మండవల్లి యూనిట్ ఎన్నిక

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ మండవల్లి యూనిట్ ఎన్నికలు శనివారం ముదినేపల్లిలోని మండల పరిషత్ కార్యాలయంలో జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన ఎన్నిక ప్రక్రియలో సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కె.నాగేశ్వరరావు తెలిపారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షులుగా పందిరి చిన్నఅప్పన్న, ఉపాధక్షులుగా బి.వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా మల్లంపల్లి వెంకట సుబ్బారావు, సంయుక్త కార్యదర్శిగా జాజుల వీరస్వామి, కోశాధికారిగా యద్దనపూడి చలపతిరావు, జిల్లా కౌన్సిలర్-1గా బిఎస్‌వి.శేషగిరిరావు, జిల్లా కౌన్సిలర్‌గా-2గా ఓరుగంటి జనార్థనరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన తెలిపారు.

ఈడేపల్లిలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని ఈడేపల్లిలో శనివారం టిడిపి ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. తెలుగు యువత కైకలూరు నియోజకవర్గ అధ్యక్షులు దావు నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పంతగాని మార్తమ్మ, పంతగాని నాగశ్రీనివాస్, బండారు రంగరాజు, దాసరి శ్రీను, వెంకట అప్పారావు, బండి సాంబశివరావు, బండి రవికుమార్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చర్చిలకు కేకుల పంపిణీ

ప్రజాశక్తి - ముసునూరు

క్రిస్మస్ సందర్భంగా మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలో 17 చర్చిలకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు యువసేన ఆధ్వర్యంలో కేకు లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పి.సీతారాం, నక్క యాహెూన్, రెడ్డి కృష్ణ, గారపాటి నరసింహరావు, నల్లిబోయిన రాంబాబు, చింత రాంబాబు, ఆటో రాంబాబు, ఆటో అంజిబాబు పాల్గొన్నారు.

పెండింగ్ చలానాలు చెల్లించాలి

ప్రజాశక్తి - భీమడోలు

పెండింగ్ చలానాలు చెల్లించకుండా వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించేందుకు జాతీయ రహదారిపై పొలసానిపల్లి వద్ద శనివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు భీమడోలు ఎస్ఐ చావా సురేష్ తెలిపారు. ఈ నేపథ్యంలో పెండింగ్ చలానాలు చెల్లించని 162 మందిని గుర్తించి వారి నుంచి రూ.35,355 వసూలు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిపై పోక్సో కేసు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

బాలికను వేధించిన వ్యక్తిపై పోలీసులు పోక్సో కేసు నమోదైంది. ఎస్ఐ సాగర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 19వ తేదిన మండలంలోని పేరంపేటలో పాఠశాల నుంచి ఇంటికి వస్తున్న ఎనిమిదేళ్ల బాలికకు చాక్లెట్ ఆశ చూపి చేయి పట్టుకుని వేధించినట్లు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంకిపాటి నాగరాజుపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.

వ్యక్తిపై కేసు

జంగారెడ్డిగూడెం : డ్రెయినేజీ విషయంలో వ్యక్తిపై దాడి చేసిన వ్యకిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ సాగర్ బాబు తెలిపారు. ఈ నెల 23వ తేదీన మండలంలోని శ్రీనివాసపురంలో తన ఇంటి వద్ద డ్రెయినేజీ బాగు చేస్తున్న కలపాల మంగరాజుపై కండెల్లి ప్రసాద్ దాడి చేశాడు. ఈ దాడిలో గాయాలపాలైన మంగరాజు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఎంఎల్‌సి సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్


జిల్లాలో మత్తు పదార్థాల రవాణా చేసే ముఠాలపై ఉక్కుపాదం మోపాలని జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ చెప్పారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో శనివారం నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు సబ్ డివిజన్లు, క్రైమ్, సర్కిల్ పరిధిలోని పోలీస్ అధికారులు సమీక్షా సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా గంజాయి, సారా, మద్యం అక్రమ రవాణా చేస్తున్న ముఠాలపై ఉక్కుపాదం మోపాలని చెప్పారు. జాతీయ రహదారులపై రాత్రివేళల్లో వాహనదారులకు పేస్‌వాష్ డ్రైవ్‌ను విధిగా నిర్వహించాలన్నారు. మహిళల ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ నిబంధనల మేరకు సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని చెప్పారు.

అధునాతన హంగులతో బజాజ్ పి 150 పల్సర్

జీలుగుమిల్లి : అధునాతన హంగులతో బజాజ్ పి150 పల్సర్ ద్వి చక్ర వాహనాన్ని శనివారం ప్రారంభించినట్లు జీలుగుమిల్లి కమలమిత్ర బజాజ్ మోటార్స్ సంస్థ యాజమాన్య అధినేత ఎమ్‌డి రహమత్ బాషా, షకిర్ తెలిపారు. ద్విచక్ర వాహనాల తయారీలో మొట్ట మొదటిగా అధునాతన ప్రొటెక్టర్ హెడ్ ల్యాంప్‌తో బజాజ్ పి 150 పల్సర్ బైక్‌ను బజాజ్ సంస్థ ప్రవేశ పెట్టడం అభినందనీయమన్నారు. బజాజ్ కంపెనీ మోటర్ బైక్ల తయారీలో నూతన ఒరవడిని తీసుకువచ్చి ప్రొటెక్టర్ హెడ్ ల్యాంప్‌తో పాటు మోనో సస్పెన్షన్ కూడా ఉంటుందని ఎమ్‌డి రహమత్ బాషా తెలిపారు. క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి సందర్భంగా ఈ ద్వి చక్ర వాహనాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో షోరూం మేనేజర్ అప్పారావు, బి.రామకృష్ణ నేలటురి అప్పారావు, సిబ్బంది నవీన్, శ్రీకాంత్, మంగయ్య, వంశీ పాల్గొన్నారు.

ఫిబ్రవరి 4 నుంచి హేలాపురి బాలోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు


మాట్లాడుతున్న ఎంఎల్‌సి షేక్‌సాబ్జీ

ఫిబ్రవరి 4, 5 తేదీల్లో ఏలూరులోని సర్ సి ఆర్ రెడ్డి పబ్లిక్ స్కూలులో నిర్వహించే హేలాపురి బాలోత్సవం-3 పిల్లల సంబరాలు పోస్టర్ ఆవిష్కరణ ఉభయగోదావరి జిల్లాల టీచర్ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ శనివారం ఆవిష్కరించారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో బాలోత్సవం కమిటీ కార్యదర్శి, జింగిల్ బెల్స్ స్కూలు డైరెక్టర్ వి.సురేష్, ఆలపాటి నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో పోస్టర్‌ను ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా షేక్ సాబ్జీ మాట్లాడుతూ విద్యార్థుల ను మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో విద్యావ్యవస్థతోపాటు తల్లిదండ్రులు పౌర సమాజం కృషి చేస్తే సహకరించేవారు పెద్ద సంఖ్యలో ఉన్నారన్నారు. ఏలూరులో ఉన్న చుట్టుపక్కల ఉన్న వివిధ సంస్థలు, దాతలు,,పిల్లల ప్రేమికులు, పాఠశాలల యాజమాన్యాలు కమిటీ చేస్తున్న ప్ర2యత్నానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. బాలోత్సవం కమిటీ ప్రధాన కార్యదర్శి ఎల్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వివిధ రంగాల నిపుణులు, మేధావులు బాలోత్సవం నిర్వహణలో భాగస్వాములయ్యేలా కలిసి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి లేళ్ల వెంకటేశ్వరరావు, కోశాధికారి విజిఎంవిఆర్.కృష్ణారావు, గౌరవ సలహాదారు ఎం.కోటేశ్వరరావు, కార్యదర్శులు గుడిపాటి నరసింహరావు, జె.సత్యనారాయణరాజు, అడిసుమిల్లి నిర్మల, కెఎస్‌కె.సత్యనారాయణ, విద్యా సంబంధ అంశాల సమన్వయకర్త ఎస్‌కె ముస్తఫా ఆలీ, ఆహ్వాన సంఘం సభ్యులు పిడి రత్నాకరరావు, కడియాల కృష్ణారావు, ఎస్.కస్తూరిరావు, పి.కస్తూరిబాయ్, పద్మజ, శారద, మేతర అజయ్‌బాబు, కూన కృష్ణారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు


బహుమతులతో విద్యార్థులు

ప్రజాశక్తి - ఏలూరు

స్థానిక 44వ డివిజన్, మేతర వారి పేట ఐద్వా మహిళా సంఘం, బాల సంఘం ఆధ్వర్యంలో క్రిస్మస్ సందర్భంగా శనివారం సాయంత్రం పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కన్వీనర్ పి.హైమావతి మాట్లాడుతూ పిల్లలు ఆటపాటలతో విద్యను అభ్యసించేలా శాస్త్రీయ ఆలోచనను పెంపొందించడానికి బాలల సంఘాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బాలల సంఘాల ద్వారా పిల్లలకు ప్రతినెలా ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వాలు కూడా ప్రతి స్కూళ్లలో పిల్లలకు సరిపడ ఆట స్థలాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లెమన్ స్పూన్, రన్నింగ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి తేజశ్రీ మాట్లాడుతూ పోటీలతో విద్యార్థుల్లో ఉన్న ప్రతిభ వెలికి తీయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు లెనిన్, బి.నాగదేవి, ఎన్.రాజేశ్వరి, పి.వరలక్ష్మి, ఎస్‌కె.జరీనా, ఎస్‌కె.ధర్యాభి, ఎన్.దుర్గ, ఎస్‌కె.కరిష్మా, పి.భవాని, ఎం.సుమ, పి.శ్రీదేవి పాల్గొన్నారు.

అభినందనీయులు పెద్దిరాజు

ప్రజాశక్తి - భీమడోలు

విజయవాడలో నిర్వహిస్తున్న ఐదో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో మండలంలోని పొలసానిపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ మద్దాల పెద్దిరాజు జిల్లా ప్రతినిధిగా పాల్గొని గుర్తింపు పొందటం అభినందనీయమని, ఇతరులకు ఆద ర్శప్రాయమని సర్పంచి షేక్ రహీమా బేగం హసేన అన్నారు. విజయవాడలో కృష్ణాజిల్లా రచయితల సంఘం, ఉత్తర అమెరికా తెలుగు అసోసియేషన్, (తానా), తానా తెలుగు సంఘ సాహిత్య వేదిక ఇతరుల సంయుక్త ఆధ్వర్యంలో సిద్ధార్థ కళాశాల వేదికగా విజయవాడలో ఐదో ప్రపంచ తెలుగు రచయితల మహాసభ నిర్వహిస్తున్నారు. దీనికి జిల్లా ప్రతినిధిగా హాజరైన డాక్టర్ మద్దాల పెద్దిరాజు ప్రభుత్వ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు. తెలుగు భాషపై ఉన్న మక్కువతో మహాసభలో నిర్వహించిన సాహితీ, సాంస్కృతిక సదస్సుల్లో పాల్గొన్నారు. ప్రతినిధుల కవి సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొని కనపరిచిన ప్రతిభకు గుర్తింపుగా ప్రశంసాపత్రం, మెమెంటోలను మహాసభ గౌరవాధ్యక్షులు మండలి బుద్ధ ప్రసాద్, అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు అందించారు. కవిగా, విమర్శకులుగా గుర్తింపు పొందిన మద్దాల పెద్దిరాజు గ్రామ సర్పంచిని శనివారం ఆయన కార్యాలయం వద్ద కలిశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పెద్దిరాజును సర్పంచి అభినందించి సత్కరించారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

భీమడోలు : గుండుగొలను హైస్కూల్‌కి చెందిన పదో తరగతి విద్యార్థులను వివిధ రూపాల్లో ప్రోత్సహించేందుకు ముందుకు వస్తున్న సంస్థల సేవలు అభినందనీయమని ప్రధానోపాధ్యాయులు సునీత తెలిపారు. పాఠశాల పూర్వ విద్యార్థి ముక్కు శ్రీకాంత్ తన తండ్రి జ్ఞాపకార్థం ముక్కు ఫౌండేషన్ సంస్థను ఏర్పాటు చేశారు. ఈ సంస్థ ద్వారా 2021 -22 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.40 వేల నగదు ప్రోత్సాహకాలు అందించారు.

పలుచోట్ల 'హౌసింగ్ డే'

ప్రజాశక్తి - భీమడోలు

గుండుగొలను గ్రామంలో ఉన్న జగనన్న లేఅవుట్ వద్ద గృహ నిర్మాణాలు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఆడిట్ ఆఫీసర్ ఎవిఆర్.గంగాధరరావు తెలిపారు. భీమడోలు మండల స్థాయిలో గుండుగొలను వద్ద హౌసింగ్ డే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అనంతరం ఆపద మిత్రలుగా శిక్షణ పొందిన గ్రామానికి చెందిన ఇద్దరు వాలంటీర్లకు సర్టిఫికెట్లను అందించారు.

చాట్రాయి : మండలంలోని సూరంపాలెం, కృష్ణారావుపాలెం గ్రామాల్లో గృహాలను మండల ప్రత్యేక అధికారి పాండురంగారావు శనివారం పరిశీలించారు. వెంటనే నిర్మాణాలను ప్రారంభించాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్.మురళీమోహన్, తహశీల్దార్ సిహెచ్.విశ్వనాధరావు, వైఎస్ఆర్ కాంతి పథం ఎపిఎం టి.శేఖర్, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ కె.రవి, గ్రామ సర్పంచి విస్సంపల్లి జ్యోతి, ఎంపిటిసి సభ్యులు చింతగుంట్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆచవరంలో 'గడపగడపకూ మన ప్రభుత్వం'

కైకలూరు రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారానికి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని ఆచవరం గ్రామ సచివాలయ పరిధిలో శనివారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామ సచివాలయ సహాయకులు, గ్రామ వాలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక స్వపరిపాలనకు పెద్దపీట వేసి పాలనలో వినూత్నమైన మార్పులను తెచ్చి ప్రజల ముంగిట ప్రభుత్వాన్ని నిలిపిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌దేనన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు.

వైభవంగా నృత్యోత్సవాలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అభినయ నృత్యభారతి, ఏలూరు 27వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న నృత్యోత్సవాలు, నృత్యపోటీలు రెండోరోజు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. యువజన నృత్యోత్సవంలో శ్రీకాకుళానికి చెందిన గాయత్రి వర్షిత కూచిపూడి నృత్యం, ఒడిశాకు చెందిన సౌరవ్ మొహంతి ఒడిస్సి నృత్యం, చెన్నైకు చెందిన జాహ్నవి షీలా కథక్ నృత్యం, విజయవాడకు చెందిన మీనాకుమారి ఆంధ్రనాట్యం, తిరుపతికి చెందిన నయనప్రియ కూచిపూడి నృత్యం అలరించాయి. వివిధ రంగాల్లో సేవలందించిన గురు శ్రీగణేషన్, మారుబోయిన కోటేశ్వరరావు, వలివేటి వెంకట సుబ్రహ్మణ్యం, మూల్పూరి ఉపేంద్ర, కొమరగిరి శ్రీనివాసరావు, మానాపురం సత్యనారాయణ, గుబ్బల రాంబాబు, రంగం రాజేష్‌లను సేవా తపస్వి అవార్డులతో సత్కరించారు.

పలు గ్రామాల్లో 'భూ రక్ష - భూ హక్కు'

భీమడోలు : ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన శాశ్వత భూ రక్ష-భూ హక్కు కార్యక్రమం ద్వారా భూ వివాదాలకు తెరపడుతుందని ఉంగుటూరు ఎంఎల్‌ఎ వాసుబాబు అన్నారు. మండ లంలో ఎంఎల్‌ఎ శనివారం పర్యటించారు. భీమడోలు, సూర ప్పగూడెం, కోడూరుపాడు, కురెళ్లగూడెం గ్రామపం చాయతీ పరిధిలో ఇటీవల కాలంలో చనిపోయిన పార్టీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు. అనంతరం ఏలూరు రెవెన్యూ డివిజన్ స్థాయిలో శాశ్వత భూ హక్కు-భూరక్ష కార్యక్రమం అమలుకు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికై, కార్యక్రమం పూర్తి చేసుకున్న కోడూరుపాడు గ్రామాన్ని ఆయన సందర్శించారు.

'ఎంఎల్‌ఎ క్షమాపణ చెప్పాలి'

ప్రజాశక్తి - చాట్రాయి

గౌడ సామాజిక తరగతి వారు దైవంగా భావించే తాటి చెట్లు, ఈత చెట్లను అవహేళన చేస్తూ మాట్లాడిన నూజివీడు ఎంఎల్‌ఎ ప్రతాప్ అప్పారావు క్షమాపణ చెప్పాలని మాజీ ఎంపిపి కందుల కృష్ణ అన్నారు. మండలంలోని టిడిపి కార్యాలయంలో ఆరుగొలనుపేట గ్రామ మాజీ సర్పంచి వెంకటేశ్వరరావు అధ్యక్షతన గౌడ నాయకులు శనివారం నిర్వహించిన సమావేంలో కందుల కృష్ణ మాట్లాడారు. పార్టీ గొడవలు ఉంటే వారు వారు చూసుకోవాలన్నారు. తాటి చెట్ల గురించి తప్పుగా మాట్లాడిన ఎంఎల్‌ఎ క్షమాపణ చెప్పాలన్నారు.

TADEPALLIGUDEM MUNICIPALITY E-PROCUREMENT TENDER NOTICE

Roc.No.E1/2422/2022-23 **Dated: 23.12.2022**

S.No.	Name of work	Name of the Grant	Estimate Value (Rs in Lakhs.)	Bid Downloading Start Date	Last Date for Receipt of Bids
1.	GGMP (Civil Works) 5 Nos (Roads & Drains)	GGMP Grant	20.00	24.12.2022 11.00 AM	02.01.2023 4.00 PM

Full details can be had from the Municipal Engineering Department during working hours or visit Web site https://tender.apeprocurement.gov.in

Sd/- Commissioner
Tadepalligudem Municipality